

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**NOVEMBER - 2017**

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH


P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
**JOSHUA GOOTAM**


Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 39** **నవంబరు - 2017** **సంచిక -4**


## క్రీస్తు రక్తము

### ( The Blood of Christ )

"ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" అని బైబిలు బోధించు చున్నది (రోమా 3:23). అయితే క్రీస్తు రక్తము వలన పాపులు రక్షింబడుదురని కూడ బైబిలు బోధించుచున్నది. "కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము" అని రోమా 5:9లో వ్రాయబడియున్నది. క్రీస్తు రక్తము ద్వారా రక్షింపబడుట అనగా యేమిటో ప్రతివాడును తెలిసి కొనవలెనని దేవుడు కోరుచున్నారు.

మానవులు దేవుని ఆరాధించుటలో రక్తము ఎల్లప్పుడు ఒక ప్రముఖ పాత్ర వహించినది. కయీను హేబెలులనుండి దేవుడు రక్తబలిని కోరినట్లు మనము గ్రహించుకొనగలము (హెబ్రీ 11:4). పాత నిబంధన కాలములో యూదులు జంతు బలులను అనేకములు అర్పించెడివారు. ఎందుకనగా రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు (హెబ్రీ 9:22). అయితే ఈ పశుబలులు మానవుల పాపములను తీసివేయలేకపోయెను. "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ

10:4). పశువులు మానవులకంటె తక్కువ విలువ గలవి గనుక వాటి రక్తము మానవుల పాపములను తీసివేయుట అసాధ్యము

మానవుని పాపములను కడిగి వేయుటకు ఒక పరిశుద్ధ మానవుని రక్తము అవుసరమాయెను. అందు వలన దేవుడే మానవునిగ యేసుక్రీస్తను పేరుతో ఈ లోకమున ఉద్భవించి సిలువ పై తన రక్తమును చిందించెను. ప్రతి పాపియు క్రీస్తు రక్తమునందు కడుగబడి రక్షింపబడగల్గునట్లు క్రీస్తు సిలువ పై బలియాయెను. ఆయన తన రక్తమును గూర్చి చెప్పుచు, "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింప బడుచున్న నిబంధన రక్తము" అని చెప్పెను (మత్తయి 26:28).

మానవుడు పాపియైనందువలన తన్ను తానే రక్షించుకొనజాలడు. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). క్రీస్తు సిలువమీద చనిపోయెను. ఆయన మరణములో తన రక్తమును చిందించెను. ఆయన చిందించిన పరిశుద్ధ రక్తము ద్వారా మనము రక్షింపబడుదుము.

యేసుక్రీస్తు పరిశుద్ధుడు గనుక ఆయన రక్తము పాపములను కడుగ గలదు. రక్షింపబడిన క్రైస్తవులకు పేతురు ఇట్లు వ్రాసెను; "పితృపారం పర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచి పెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింవ బడలేదు గాని, అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రె పిల్ల వంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా" (1 పేతురు 1:18,19). వెండి బంగారములు అక్షయమైనవి, రక్తము క్షయమైనదియని మనము అనుకొన వచ్చునుగాని, క్రీస్తు రక్తము అక్షయమైనది. వెండి బంగారములు క్షయమైనవియని భక్తుడైన పేతురు బోధించుచున్నాడు. యేసుక్రీస్తు పరిపూర్ణ జీవితమును జీవించెను

గనుక ఆయన రక్తము అమూల్యమైనది (1పేతురు 2:22-25). "నీవు వధింప బడినవాడవై నీరక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను, ప్రతి ప్రజల లోను, ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులను విమోచించి మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను, యాజకులనుగాను చేసితివి" యని పరిశుద్ధులు యేసును పరలోకములో కొనియాడుటను యోహాను చూచి ప్రకటన గ్రంధములో వ్రాసెను (ప్రక. 5:9-10). అందువలన "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును" అని అపో.పౌలు వ్రాసెను (హెబ్రీ 9:14). ఎఫెసులో యున్న క్రైస్తవులు ఒకప్పుడు నిరీక్షణ లేనివారు, దేవుడు లేనివారు, క్రీస్తుకు దూరస్థులై యుండగా వారు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారని పౌలు వారికి తెలియజేసెను (ఎఫెసీ 2:12,13). మానవుని పాపముల నుండి విమోచించుటలో క్రీస్తురక్తము ఎంత ప్రాముఖ్యమైనదో ఇంత వరకు మనము చూచిన లేఖనముల వలన గ్రహించు కొనవచ్చును.

అయితే మనము క్రీస్తు రక్తము వలన విమోచింపబడవలెనంటె దేవుని షరతులకులోబడవలెను. దేవుని కుమారుడైన క్రీస్తు చనిపోయి తన రక్తమును చిందించెను. మన పాపముల నిమిత్తము ఆయన పొందిన మరణమును ప్రాయశ్చిత్తముగా దేవుడు అంగీకరించెను. అయితే క్రీస్తు రక్తము ద్వారా మనము రక్షింపబడవలెనంటే క్రీస్తుకు మనము విధేయులము కావలెను. మన అతిక్రమములను బట్టి ఆయన గాయపర్చబడెను, మన దోషములను బట్టి ఆయన నలుగ గొట్ట బడెను అని ప్రవక్తయైన యెషయా పలికెను (యెషయా 53:5). క్రీస్తు తన రక్తమును చిందించినందున క్రీస్తు "తనకు విధేయులైన వారి కందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" అని హెబ్రీ 5:10లో వ్రాయబడి యున్నది.

పాపియైన మానవుడు క్రీస్తు రక్తమును తాకి యెట్లు శుద్ధిచేయ బడగలడు? అనే ప్రశ్న ఇప్పుడు మనకు రావచ్చును. యేసుక్రీస్తు నందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలుగునని ఎఫెసీ 1:7లో వ్రాయబడి యున్నది. అందువలన క్రీస్తునకు వెలుపల యుండి క్రీస్తు రక్తము వలన ఎవడును రక్షింపబడజాలడు. అయితే మనము క్రీస్తులో ప్రవేశించుట యెట్లు?

మనము క్రీస్తులో ప్రవేశించ వలెనని దేవుని కుమారుడైన క్రీస్తే రక్షకుడని మనము విశ్వసించవలెను (యోహాను 8:24). అట్లు విశ్వసించిన వారు తమ పాపముల విషయమై మారుమనస్సు నొంది క్రీస్తు రక్తముచే కడుగబడునట్లు తమ పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము పొందవలెను (అపో.కా. 2:38).

అపో.పౌలు ఇట్లనుచున్నాడు : "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీ రెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగల వారమైన యెడల ఆయన పునరుత్థానము యొకక సాదృశ్య మందును ఐక్యము గలవారమై యుందుము, ఏమనగా మనమింకను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా 6:3-6).

ఇక్కడ, మన విధేయత ద్వారా క్రీస్తు మరణములో మనము పాలివార మగుదుమని అపో.పౌలు చెప్పు చున్నాడు. బాప్తిస్మములో మనము క్రీస్తు రక్తముదరికి చేరి దానిద్వారా కడుగబడుదుము. ఒకడు బాప్తిస్మము

పొందువరకు క్రీస్తు రక్తము యొక్క శుద్ధిచేయు శక్తిని పొందలేడు. అందువలననే ప్రజలు క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొందవలెనని మేము విజ్ఞాపన చేయుచున్నాము. బాప్తిస్మము పొందుటవలన ఒకడు క్రీస్తులోనికి ఆయన శరీరమైన సంఘములోనికి ప్రవేశించును (ఎఫెసీ 1:22,23; 1కొరింథి 12:13).

ఒకడు బాప్తిస్మము ద్వారా క్రీస్తుకు విధేయుడు కాగానే అతడు క్రైస్తవుడగును. క్రీస్తు సంఘం సభ్యుడగును. తనవలెనే క్రీస్తు రక్తము ద్వారా విమోచింపబడిన వారితో కలసి దేవుని ఆరాధించు తరుణము అతనికి లభ్యమగును. నీవు క్రీస్తు రక్తముచే కడుగబడగోరుచున్నావా? అయితే "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి, బాప్తిస్మము పొంది నీ పాపములను కడుగుకొనుము (అపో.కా. 22:16).

## అత్యంత విలువైన దానిని కనుగొనుట
## ( The most valuable Discovery )

సర్‌జేమ్స్ సింప్సన్ అనునతడు 1874లో ఎడింబర్గ్, ఇంగ్లాడులో క్లోరోపార్మ్‌ను (Chloroform) కనుగొన్నాడు. శస్త్రచికిత్సకు ముందు నొప్పి తగులకుండా రోగికి ఈ మత్తుమందును వైద్యులు ఇస్తారు. యిది ఆధునిక వైద్యశాస్త్రములో అత్యంత విలువైన సంగతియని అందరు ఆయనను కొనియాడారు. క్లోరోఫార్మ్‌ను కనుగొనక ముందు మత్తుమందు లేకుండగనే ఆ రోజులలో ఆపరేషన్లు జరిగించబడేవి. రోగులు పడిన బాధ ఇంతా అంతా కాదు.

అనేక సంవత్సరముల తరువాత సర్‌జేమ్స్ సింపన్స్ గారు ఎడింబర్గ్ యూనివర్శిటీలో ఉపన్యసించు చుండగా ఒక విద్యార్థి "మీ జీవితంలో మీరు కనుగొనిన అత్యంత విలువైన సంగతి యేమిటి?"యని ఆయనను ప్రశ్నించాడు. ఆయన వెంటనే "నా జీవితంలో నేను ఒక పాపినని

యేసుక్రీస్తు నా రక్షకుడని కనుగొనుట యే అత్యంత విలువైన సంగతి" యని జవాబిచ్చాడు.

జాన్‌న్యూటన్ అనునతడు ఇంగ్లీషు పాటలలో అత్యంత ప్రాబల్యము చెందిన "Amazing Grace" అను పాట వ్రాసాడు. తనకు 82వ సంవత్సరము వచ్చేసరికి, జ్ఞాపకశక్తి కుంటుబడుచు, దృష్టిమాంద్యము వలన అంధుడయ్యే పరిస్థితిలో యుండగా ఇట్లు చెప్పాడు : "నా జ్ఞాపక శక్తిని ఇంచుమించు కోల్పోయాను. గాని రెండు సంగతులను నేను మరచి పోలేదు. నేనొక గొప్పపాపిని, యేసుక్రీస్తు నా గొప్ప రక్షకుడు" అని చెప్పాడు. రోమీయులకు వ్రాయబడిన పత్రిక సింప్సన్, జాన్‌న్యూటన్ గార్లు చెప్పిన సంగతులను మనకు విశదీకరించు చున్నది.

మన సమస్య పాపము (రోమా 3:10,23).

పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23).

పాపులను రక్షించేశక్తి క్రీస్తు సువార్త (రోమా 1:16).

మనలను రక్షించుటకు క్రీస్తు చనిపోయెను (రోమా 5:8).

పాపవిమోచన క్రయధనము రక్తము (రోమా 5:9).

ఆ రక్తము దరికి మనము చేరుకొనే విధానము? మన విశ్వాసాన్ని క్రీస్తునందుంచి (రోమా 5:1), పాపముల విషయమై మారుమనస్సు పొంది (రోమా 2:4), క్రీస్తు నామమును ఒప్పుకొని (రోమా 10:9-10) క్రీస్తునామమున బాప్తిస్మము పొందవలెను (రోమా 6:1-4). తదుపరి మన జీవితాన్ని ఆయన సేవ కొరకు ప్రతిష్ఠించుకొన వలెను (రోమా 6:12-18, 12:1).

నీ రక్షకుని నీవు కనుగొనుటయే జీవితంలో నీవు కనుగొనే అత్యంత విలువైన సంగతి!!

# పెద్దల ఎంపిక, నియామకము
## ( Selection and Appointment of Elders )

పెద్దలు తమకు తావే నియమించు కొన్నవారు కారు (అపో.కా. 14:23; తీతు 1:5). గొప్ప బాధ్యతను కలిగిన ఈ మనుష్యులను లేఖనార్థమైన అర్హతలను బట్టి స్థానిక క్రైస్తవులు (సంఘము) వారికి ఆ బాధ్యతను అప్పగించును. అప్పుడు పరిశుద్ధాత్ముడు వారికి ఆ బాధ్యతలను అప్పగించును (అపో.కా. 20:28). పెద్దలు తయారుచేయబడ్తారు. అది పుట్టుకతోనే వచ్చేదికాదు. వారిని ఆస్థానము నుండి తొలగించవచ్చును కూడ (1 తిమోతి 5:19-20).

దీనిని గూర్చి యేమి పొరబడ వద్దు. సంఘ పర్యవేక్షణ ఒక తీవ్రమైన పనియైయున్నది. అది చిన్నపిల్లలకు కాదు. నాయకులు కాని వారికి కాదు. ప్రభువు పనికి ప్రథమస్థానమునియ్యని వారికి కాదు; సరిగదా పిరికివారికి అంతకుమందే కాదు. గనుక పెద్దలను జాగ్రత్తగా ఎంచుకొని నియమించవలెను. ఏలయనగా పెద్దగా సరియైన వ్యక్తిని ఏర్పాటు చేయడం తేలికయే. అనర్హుని నియమించిన తరువాత వానిని తొలగించడం కష్టము. ప్రభువు సంఘము చాల ప్రాముఖ్యము. అది అమూల్యమైనది (అపో.కా. 20:28). అందువలన అనర్హులను పెద్దలుగా నియమించనే నియమించకూడదు.

అర్హతగల వారినే ఎంపికచేస్తే పెద్దలు మంచిగా యుంటారు. పెద్దలను ఏర్పాటుచేసే పద్ధతి ఎన్నడు ప్రజలమెప్పు కొరకు జరిగించకూడదు. వాళ్లు రాజకీయంగా పలుకబడిగల వారనో, మంచివ్యాపారవేత్తలనో తలంచి పెద్దలుగా ఏర్పాటు చేయ కూడదు. మరియు సంఘములోను, వెలుపట కూడ యున్న వారి బంధు వర్గమును బట్టి ఏర్పాటు చేయకూడదు. వారు ఉన్నత విద్యావంతులనేది ఒక్కటి మాత్రమే పరిగణలోనికి తీసికొన కూడదు. మరియు వారు ఆర్థికంగా

అభివృద్ధి జెందినవారు, సంపద గల వారనేది ఒక అర్హత కాకూడదు. మరియు అందరి పై పెత్తనము చెలాయించేవాడు, అధికారకాంక్ష కలవాడు ఎంపిక చేయబడకూడదు.

ప్రతి స్థానిక సంఘము ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది పెద్దలను కలిగి యున్నట్లు క్రొత్త నిబంధనలో మనకు సరిపడినంత సమాచారము కలదు (అపో.కా. 14:23; తీతు 1:5; అపో.కా. 20:17). అయినను పెద్దలు లేనంత కాలము స్థానిక సంఘములు దైవానుమతి చొప్పున పనిచేసినట్లు మనం చూడగలము (1తిమోతి 3:1-7; తీతు 1:6-11; హెబ్రీ 13:17). వారిని వర్ణించుటకుపయోగించిన పదములే వారు చేయు పనిని ప్రత్యక్ష పరచు చున్నవి. కాపరులు (ఎఫెసీ 4:11), పర్యవేక్షకులు (కాయువారు) (అపో.కా. 20:28), మందను కాయువారు 1 పేతురు 5:1-4). పెద్దలను ఎంపిక చేసి, వారిని నియమించు పద్ధతిని బైబిలు సూచించుట లేదు.

పెద్దలను ఏలాగు ఎంపిక చేసుకోవాలో ఏలాగు వారిని నియమించాలో క్రొత్తనిబంధనలో మనకు ఒక పద్ధతిని సూచించుట లేదు. గనుక సంఘమునకు ఆమోద యోగ్యమైన రీతిలో అర్హత గల వారిని స్థానిక సంఘము నియమించ వచ్చును. వారేలాగు నియమించబడాలో చెప్పే లేఖనము యేదీలేదు. గనుక లేఖనములను అతిక్రమించకుండా ఏ విధముగానైనను పెద్దలుగా వారిని నియమించవచ్చును.

పెద్దలను నియమించే పద్ధతి క్రొత్త నిబంధనలో యేమీ లేదు గనుక, అపో.కా. 6లో పరిచారకులను నియమించిన విధానము నను సరించుట యుక్తము. పరిచర్య చేయు నిమిత్తము వారిలో యోగ్యులైన మంచి వారిని ఎంపిక చేయాలని అపొస్తలులు సంఘమును హెచ్చరించిరి. ఈ విషయములను గూర్చి స్థానిక సంఘము సరిగ బోధింప బడిన తరువాత వారిని పెద్దలుగా నియమించు కొనవచ్చును. నియమించే

పద్ధతి యేదీ లేఖనాల్లో స్పష్టము చేయ బడలేదు.

పెద్దలు లేనప్పుడు సంఘములో యున్న పురుషులు సంఘము యొక్క పనులు జరిగించే బాధ్యత కలిగి యున్నారు. పెద్దలు నియమింపబడే వరకు వారాబాధ్యతను కలిగి యుందురు. అర్హతగలవారు సంఘములో యుండగా వారిని పెద్దలుగా నియమించకుండా సంఘ కార్యకలాపములు జరిగించుట యుక్తము కాదు. అదేరీతిగా లేఖనములు చెప్పురీతిగా గాక వేరొక విధంగా (కమిటీల ద్వారా) సంఘము యొక్క పనులు జరిగించుట బైబిలు విరుద్ధము.

జ్ఞానులైన పెద్దలు తమ నాయకత్వమును బట్టి తమ్మును గూర్చి మంచి మాదిరి, పేరు నెలకొల్పు కొందురు. ఉన్నవారే గాక ఇంకా ఎక్కువ మంది పెద్దలను నియమించు కొనాలన్నా లేదా ఉన్న పెద్దలలో ఒకరు మరణించగా ఆ స్థానములో ఇంకొకరిని నియమించాలన్నా, అది స్థానిక సంఘము యొక్క విచక్షణ మీద ఆధారపడియుండును. పెద్దలుగా లేక పెద్దగా నియమింపబడాలను కొనే వారి పేర్లను సంఘము ముందుగానే ప్రకటింపవచ్చును. మరియు స్థానిక సంఘకాపరులు సంఘములోని స్త్రీ పురుషులను శ్రేష్టమైన సేవకొరకు తప్పక తయారు చేయుదురు. ఇట్టి వారిలో నుండి భావిలో పెద్దలు వారి భార్యలు తయారగుదురు. క్రీస్తు యొక్క బోధను వారికి ఉపదేశించియుంటే (2 తిమోతి 2:2), భక్తిగల స్త్రీ పురుషులు అనేకులు ఈ నాయకత్వ లక్షణములను పెంపొందించు కొందురు (హెబ్రీ 6:1,2; 2యోహాను : 9). ఒక స్థానిక సంఘములో పెద్దలు లేనప్పుడు వారినెట్లు నియమింతురు?

పెద్దలుగా స్థానిక సంఘము కొందరి పేర్లను ప్రతిపాదించినప్పుడు అట్టి పురుషులు ముందుగా పరీక్షింప బడవలెను. సాధారణంగా స్థానిక సువార్తికుడు గాని, ఉపదేశకులుగాని కొంతకాలమట్టుకు పెద్దలకుండ వలసిన అర్హతలను గూర్చి బోధించుచు

యుందురు. పెద్దలనుండి దేవుడేమి కోరుచున్నారో తెలిసికొనిన తరువాత స్థానిక సంఘము వారిలో నుండియే కొంతమంది పేర్లను పెద్దలుగా యుండుటకు ప్రతిపాదించుదురు.

సాధారణంగా సంఘములో కొంతమంది పేర్లు ప్రకటించబడును. వారిలో కొంతమంది పెద్దలుగా యుండుటకు ఇష్టపడని యెడల వారి పేర్లు ఆ జాబితా నుండి తీసివేయ బడును. తదుపరి రాబోవు రెండుమూడు వారాల్లో అభ్యంతరములే మైనా ఎవరిని గూర్చియైనా ఉన్న యెడల సంఘము తెలియజేయ వచ్చునని చెప్పబడును. కొన్నిసార్లు సహోదరులు తమకు తామే విరమించు కొందురు. ఆ లిస్టులో యుండకుండ వారు విరమించుకొందురు. మిగతా వారిని గూర్చి సంఘమునకు అభ్యంతరము లేమీ లేనియెడల వారిని పెద్దలుగా స్థానిక సంఘము నియమించును.

పెద్దలను నియమించు పద్ధతి బైబిలు సూత్రములకు భిన్నముగా లేనంతవరకు సంఘము యొక్క అభీష్టము మేరకు పెద్దల నియామక కార్యక్రమమును నిర్వహించవచ్చును. వారు బైబిలులో నిర్ణయింపబడిన అర్హతలు కలిగియుండుట అత్య వసరము. ఆ రోజు జరిగే కార్య క్రమములో పెద్దల నియామక కార్యక్రమము తీవ్రమైనది, భక్తిభావము లతో నిండియుండునది. పెద్దలుగా నియమింపబడిన వారిని గూర్చి స్థానిక సంఘముకును తెలియజేయవలెను. స్థానిక సంఘములో పురుషులేఇవ్విధ మైన పరిచర్యకు నియమింపబడిన ఉదాహరణ మనకు లేఖనములలో కలదు (అపొ.కా. 6:3).

అపొ.కా. 6:1-6లో స్థానిక సంఘములో పరిచర్య చేయువారిని గూర్చిన హెచ్చరిక ఇయ్యబడినది. ఆయర్హతలను బట్టి స్థానిక సంఘము వారిలో యున్న పురుషులను ఎంచు కొనాలని చెప్పబడినది. (సాధారణంగా స్థానిక సంఘము పెద్దలను గూర్చి సంతృప్తి కలిగి యుండకపోతే వారిని అనుసరించరు). అప్పుడు

అపోస్తులులు వారిని సంఘములో పరిచర్య నిమిత్తము ఏర్పాటు చేసిరి. మరియు స్థానిక సంఘములో నుండియే ఆయా పనులు నిమిత్తము పురుషులు ఎంపిక చేయబడిన బైబిలు ఉదాహరణ మనకున్నది (అపొ.కా. 13:2,3).

**ముగింపు :**

పెద్దలు ప్రాముఖ్యులని తలంచి దేవుడు వారికి కొన్ని అర్హతలనేర్పాటు చేసి యున్నారు. వారి అర్హతలలో యేమీ తేడాలేదు. గనుక క్రొత్త నిబంధన పెద్దలను గూర్చి యేమి చెప్పుచున్నారో క్రైస్తవులు తెలిసికొనాలి. పెద్దలు, కాపరులు, అధ్యక్షులు, ప్రెస్బిటర్లు అనుపదములు అన్నీ ఒకే పనిని సూచించుచున్నవి. అవి బిరుదులు కావు. ప్రతి సంఘములోను ఇద్దరు అంతకంటే ఎక్కువమంది పెద్దలుండవలెను (అపొ.కా. 14:23; 20:17; ఫిలిప్పీ 1:1; 1తిమోతి 5:17; తీతు 1:5; హెబ్రీ 13:17). మరియు ప్రతి సంఘపెద్దయు మిగతావారితో కలసి సమానాధికారము కలిగి యుండును. వారిలో సీనియర్ జూనియర్ అనే కేడరులుండవు.

పెద్దలుగా యుండుట గొప్ప బాధత్య గల స్థానము. వారికి భూమి పై అత్యంత బాధ్యత అప్పగించ బడి యున్నది. క్రీస్తు సంఘము స్థానికంగా పెద్దలు కలిగియుండును. యిది దాని యొక్క ప్రత్యేకత.

పెద్దలుగా యుండగోరు ప్రతి వాడు క్రొత్తనిబంధన చెప్పు అర్హతలు కలిగియుండవలెను (1తిమోతి 1:13, తీతు 1:5-9). సంఘపెద్దలు సంఘమును కాయుచు, దానిని పోషించుచు యుండవలెను (హెబ్రీ 13:17; అపొ.కా. 20:28; 1 పేతురు 5:2). స్థానిక సంఘములో నిజమైన అర్హతలు కలిగిన పెద్దలుంటేనే ఆ సంఘము దేవుని చిత్తప్రకారము పరిపూర్ణముగా నడుచుకొనును. అందువలన ప్రతిస్థానిక సంఘము పెద్దలచే పాలింపబడాలన్నప్పుడు దేవుడు చెప్పినది ఆయన బాగుగా ఎరుగును!

- లూయిస్ రష్మోర్

# యేసుక్రీస్తు స్థాపించిన సంఘము

## ( The church that Jesus built )

యేసు క్రీస్తు స్థాపించిన సంఘము ప్రవచనాంశము. ప్రవక్తయైన యెషయా ఇట్లు చెప్పాడు : "అత్యంత దినములలో పర్వతముల పైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లును. జనులు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబుదేవుని మందిరమునకు యెహోవా పర్వతము నకు మనము వెళ్లుదమురండి. ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పు కొందురు" (యెషయా 2:2,3). ఈ ప్రవచనము నుండి మనమనేక సంగతులు నేర్చు కొనవచ్చును.

మొదటిగా అది అంత్యదినము లలో జరుగును. అపో.కా. రెండవ అధ్యాయములో జరిగిన జరుగుచున్న సంఘటనలు అంత్యదినములని అపో. పేతురు చెప్పాడు. అక్కడ సంఘము స్థాపించబడెను. రెండవదిగా యెషయా, యెహోవా మందిరమును గూర్చి చెప్పాడు. 1తిమోతి 3:15 నుండి యెహోవా దేవుని మందిరమే క్రీస్తు సంఘమని మనము గ్రహించ గలము. మూడవదిగా అది యెరూషలేములో ఆరంభమగును. అపో.కా. 2లో క్రీస్తుసంఘము యెరూషలేములో ఆరంభమైనట్లు మనము నేర్చు కొనగలము. గనుక యెషయా నిజానికి క్రీస్తుసంఘమును గూర్చి ప్రవచించినట్లు గ్రహించ గలము.

మన ప్రభువు సిలువ వేయ బడక ముందు ఒక వాగ్ధానము చేసారు. ఆయన సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని పేతురు ఒప్పుకొనిన తరువాత (మత్తయి 16:16), యేసు, "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని" ఆయన చెప్పెను (మత్తయి 16:18). మన

ప్రభువు తన సంఘమును స్థాపింతునని ఇక్కడ వాగ్దానము చేసారు. "నేను నా సంఘమును కట్టుదును" అని చెప్పిన ఆయన మాటలను గమనించుము. నా సంఘము అని ఆయన చెప్పినప్పుడు అది ఆయన సంఘమని మనం ఎరుగుదుము. దానిని యేసు తన స్వరక్తమిచ్చి సంపాదించినట్లు అపో.పౌలు చెప్పాడు (అపో.కా.20:28). గనుక ప్రభువు సంఘము ఆయనకే గాని మరెవనికి చెందదని మనమెరుగుదుము. మరల "నా సంఘమును కట్టుదునని" యేసు చెప్పిన మాటలను గమనించుము. నా సంఘములను కట్టుదును అని ఆయన చెప్పలేదు. ఈ లోకములో ఆయన అనేక సంఘములను గాక ఒకే ఒక్క సంఘముండవలెనని ఉద్దేశించారు. అందువలననే ఆయన విశ్వాసులందరు ఏకమై యుండవలెనని ఆయన ప్రార్థించారు. "తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మన యందు ఏకమైయుండ వలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు, వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకు ప్రార్థించుచున్నాను" (యోహాను 17: 20,21).

క్రీస్తు సమాధి నుండి తిరిగి లేచిన తరువాత "ఇహమందును పరమందును సమస్తాధికారము నా కియ్యబడియున్నది" యని చెప్పారు (మత్తయి 28:18). క్రీస్తుకు సమస్తాధికారము ఇయ్యబడియుంటే, వేరే ఇంకొక సంఘమును స్థాపించుటకు ఎవరికీ ఏ అధికారము లేదు.

నేడున్న వేలకొలది మానవ కల్పిత సంఘములు దేవుని సంకల్పమునకు భిన్నముగా యున్నవి. అందరు ఏకమైయుండాలని ఆయన సంకల్పిస్తే, మానవకల్పిత సంస్థలు అందరినీ విడదీయుచున్నవి. కాలాంతమందు యేసు తన రాజ్యమనే సంఘమును తండ్రికి అప్పగించును. "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును. అప్పుడు అంతము వచ్చును" (1 కొరింథీ 15:24). ఆయన తండ్రికి అప్పగించే సంఘములో నీవుందువా?

- చార్ల్స్ బర్క్

# అభివృద్ధిజెందుచున్న సంఘ లక్షణములు

## ( Marks of a Growing Church )

క్రీస్తుసంఘము ఆరంభమైన పెంతెకొస్తునాడు మూడువేల మంది బాప్తిస్మము పొందుట మనము చూడ గలము. వారు సంఘముతో చేర్చ బడిరి. నాటి నుండి గొప్ప అభివృద్ధి జరుగుట మనము గమనించగలము. రెండు అధ్యాయముల తరువాత 5వేల మంది సంఘముతో చేర్చబడుట మనము గమనించగలము (అపొ.కా. 4:4). దీని తరువాత నాలుగు సందర్భములలో యెరూషలేములోని సంఘము వృద్ధియగుట మనము గమనించగలము (అపొ.కా. 6:1,7; 7:17; 9-31). యెరూషలేములోని ఆదిమ క్రీస్తుసంఘము ఎట్లు అభివృద్ధి జెందినదో అదే సూత్రములు నేటికిని వర్తించును (అపొ.కా.2:42-47).

**ఎడతెగక యుండిరి :**

"వారు అపొస్తులుల బోధ యందును, సహవాసము నందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42). క్రైస్తవులు దేవుని వాక్యజ్ఞానము నందు అభివృద్ధి జెందు నట్లు వారు తరుచు కూడు కొను చుండిరి. ఈ రీతిగా వారి ఒండొరుల సహవాసము బలపడెను. సంఘము కూడుకొనునప్పుడెల్లా సభ్యులందరు హాజరయ్యేవారు.

క్రికెట్ మ్యాచ్‌కు ఆటగాళ్ళు మాత్రమే హాజరైతే ఆ ఆటయొక్క పరిస్థితి, క్రికెట్ యొక్క పరిస్థితి దీనముగా యుండును. అదేరీతిగా సంఘ సభ్యులు కూటములకు, ఆరాధనలకు హాజరుకాకపోతే సంఘము అభివృద్ధిజెందుట కష్టము.

**భయము కలిగి యుండిరి :**

"అప్పుడు ప్రతివానికి భయము కలిగెను. మరియు అనేక మహాత్కార్యములును, సూచక క్రియలును అపొస్తులుల ద్వారా జరిగెను" (అపొ.కా. 2:43). ప్రతి సభ్యుడు దైవభయము కలిగి యుండక పోతే సంఘము అభివృద్ధి కాజాలదు. "పగ తీర్చుట నా పని, నేనే ప్రతిఫల మిత్తుననియు మరియు ప్రభువు తన

ప్రజలకు తీర్పు తీర్చును అనియు చెప్పిన వానిని ఎరుగుదుము గదా. జీవము గల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీ 10:30,31). ఈ లోకస్థులకే తీర్పు తీర్చబడునని మనం తరుచు అనుకొంటాము గాని ఈ వచనం అయితే ప్రభువు తన ప్రజలకు తీర్పుతీర్చునని చెప్పుచున్నది. ప్రభువు యొక్క ఉగ్రతను బట్టి పౌలు బలమైన సువార్త చేయగలిగెను. "కావున మేము ప్రభువు విషయమైన భయము నెరిగి" అని 2 కొరింధీ 5:11లో అతడు చెప్పుచున్నాడు. దేవుని గూర్చిన సరియైన భయము కలిగి యున్నప్పుడు సంఘములు అభివృద్ధిజెందును.

**ఆదుకొనుచుండిరి :**

"విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చర స్థిరాస్థులను అమ్మి అందరికిని వారి వారి అక్కర కొలది పంచిపెట్టిరి" (అపొ.కా. 2:44,45). సంఘము ఒక సంస్థ కంటే గొప్పది. అది ఒక కుటుంబము! ఆదిమ యెరూషలేము సంఘము ఒకరి నొకరిని గూర్చి ఎక్కువ ఆసక్తి కలిగి యుండిరి. దాతృత్వము ఒక్కటి మాత్రమే సరిపోదు గాని అది లేకుండా సంఘము అభివృద్ధిజెందదు (1 యోహాను 3:17; ప్రక 2:4, యాకోబు 6:10).

**ఐక్యత కలిగి యుండిరి :**

"మరియు వారేకమనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు దేవుని స్తుతించుచు ప్రజలందరి వలన దయపొందిరి" (అపొ.కా. 2:46). "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంతమేలు ఎంతమనోహరము" అని దావీదు మహారాజు వ్రాసాడు (కీర్తన 133:1). సహోదరులలో ఐక్యత లేనియెడల సంఘము అభివృద్ధి కాజాలదు.

**ప్రజాదరణ కలిగి యుండిరి :**

వారు "ప్రజలందరి వలన దయ పొందిన వారై ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న

వారిని అనుదినము వారితో చేర్చు చుండెను" (అపో.కా. 2:47). సమాజమునకు వేరై సంఘము అభివృద్ధి జెందదు. అది సమాజము నకు కనబడాలి (మత్తయి 5:13,14). యెరూషలేము క్రీస్తు సంఘము క్రీస్తు కొరకు ప్రత్యేకముగా జీవించుచున్న సంఘము (1పేతురు 2:5). వారు క్రీస్తును సమాజమునకు చూపించు చుండిరి.

**సువార్త చేయు సంఘము :**

అనుదినము రక్షణ పొందు చున్న వారిని ప్రభువు వారితో చేర్చు చుండెను. సువార్తను ప్రకటించుచు సభ్యులు తీరిక లేక యుండిరి. వారికి హింస సంభవించినను, చెదరిపోయిన వారు వాక్యము ప్రకటించుచు, ఆత్మలను సంపాదించుచు సంచరించు చుండిరి (అపో.కా. 8:4).

నాడు యెరూషలేము సంఘము వలె నేడు మనమును అభివృద్ధి జెందాలంటే వారివలెనే నేడు మనము ఉండాలి, పనిచేయాలి. సువార్త వినకుండా లక్షలాది ప్రజలు మరణించు చున్నారు.

– ఇయన్ మెక్‌ఫర్సన్

## పేద విధవరాలు

## ( A Poor Widow who was rich)

దేవుని యెడల మానవుని విధులు అనగా క్రైస్తవునికి ధనమునకు గల సంబంధమును గూర్చి తెలియ చేయుటకుగాను పేద విధవరాలిని గూర్చిన సాదృశ్యము ప్రభువైన యేసు ద్వారా బైబిలు గ్రంధము నందు చెప్పబడెను (మార్కు 12:41-44).

**1. దేవుడు, మానవుడు – అతని లౌకిక స్థానము :**

దేవునికి, మానవునికి వాని ధనమునకు గల సంబంధము యెన్నడును తప్పించుకోలేనటు వంటిది. ఆయన మొదటి కుటుంబమును యేర్పరచినపుడు కూడ వారికి కలిగిన దానిలో నుండి దేవునికి అర్పణమును అర్పించవలెనని ఆయన ఆజ్ఞాపించెను. క్రైస్తవుడు, వాని ధనము అనే అంశమును గూర్చి ప్రతి క్రైస్తవ

వ్యక్తి అనుదిన జీవితములో అనుభవ పూర్వకంగా ఎదుర్కొనుచున్న యొక సమస్య.

**2. ఇచ్చుటను గూర్చి ప్రభువైన యేసు చూపిన ఆసక్తి.**

1. ఆయన కానుక పెట్టె యెదుట కూర్చుండి వారు కానుక పెట్టెలో డబ్బులు వేయుట చూచు చుండెను. ఒక బీద విధవరాలు వచ్చి రెండు కాసులు వేయగా ఆయన చూచెను. దృష్టాంతములతో బోధించుటకు తరుణములుపయోగించు ప్రభువు ఆయన శిష్యులను పిలిచి కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరి కంటె ఈ పేద విధవరాలు యెక్కువ వేసెనని చెప్పెను.

2. రెండు రకములైన ధనమును గూర్చి ప్రభువైన యేసు చెప్పెను. ఇహలోక సంబంధముగ చూచి నట్లయిన ఈ బీద విధవరాలు నిరుపేద, కాని నీతి విషయములో ధనికురాలు. దేవుని యెడల ఐశ్వర్య వంతుడై నట్టివాడు ఇహలోక సంబంధమైన ధనమును కలిగి యుండుటలో యేమియు తప్పులేదు. అబ్రాహాము, యోసేపు, యోబులను చూచి నట్లయిన వారు దేవునియందు ఐశ్వర్యవంతులై యుండియు మిక్కిలి ఆస్థిగల వారు. మిక్కిలి ఆస్థిగలిగి యుండియు దేవుని కలిగి యుండని వ్యక్తిని గూర్చి దేవుడు వెఱ్ఱివాడా అని అనుచున్నారు (లూకా 12:15-21). దేవుని యెడల ధనవంతుడుకాక తనకొరకే ధనమును సమకూర్చు కొనువాడు అలాగుననే యుండును. దేవునిని కలిగిన వారు ధనము లేనప్పటికి జీవించగలరు. కాని ధనికులు దేవుడు లేకుండ జీవించుట దుర్లభము. ఐశ్వర్యము ఘనతలును, స్థిరమైన కలిమియు, నీతియు నాయొద్ద నున్నవి (సామె 8:18). ఈ పేద విధవరాలుకు రెండు కాసులు మాత్రమే యున్నవి. కాని నీతియు శాశ్వతమైన జీవము ఆమెకు గలవు. ప్రభువైన యేసు రెండు రకములైన ధనమును గూర్చి చెప్పుటను జ్ఞాపకము చేసికొందము. భూమిమీద మీ కొరకు ధనమును కూర్చు

కొనవద్దు.... పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దానిని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలదరు. (మత్తయి 6:19, 20). ఈప్రత్యేకమైన భాగములో ధనమును కూడబెట్టుట మంచిది కాదు అని ప్రభువు చెప్పు చున్నట్లు మనము గ్రహించ గలము.

**ఇచ్చుటను గూర్చి ప్రభువు యెందుకు ఆజ్ఞాపించెను ?**

1. దేవుని నుండి ఈయబడిన యే ఆజ్ఞయైనను తేలిక స్వభావముతో అనుసరించుటకు ఈయబడలేదు గాని అవి మనకు క్షేమమును కలిగించుటకే ఈయబడెను. ఎట్లు? నీ ధనమెక్కడ యుండునో అక్కడనే నీ హృదయ ముండును (మత్తయి 6:21). నిత్య జీవార్థమైన కోరిక కలిగియుండునట్లు మన హృదయములు దానిపై కేంద్రీకరింపబడవలెనని ప్రభువు కోరుచున్నారు. ఎట్టి ధనమును సంపాదించుటకు నీ హృదయము ఆశించుచున్నదో దానిని బట్టి నీ హృదయ స్థితిని తెలిసికొనవచ్చును. ఎందుకనగా నీ ధన మెచ్చటయుండునో అచ్చటనే నీ ప్రాణముండును. ఇచ్చుటలో వెనుకబడిన వ్యక్తి ఆత్మీయ జీవితములో అధోగతిలో యున్నాడని గ్రహించవలెను. ఆత్మీయ జీవితములో ముందుకు సాగుచున్న వ్యక్తి దేవుని కార్యములు కొనసాగించుట కొరకు దేవునికి కిచ్చుటలో యే మాత్రమును వెనుదీయడు.

2. క్రీస్తును పోలి మనము జీవించుటకు గాను ఆయన చేసిన త్యాగమును గూర్చి గొప్ప పాఠమును నేర్చుకోవలెను. క్రైస్తవ్యములో ఒక ప్రాముఖ్యమైన విషయము ఇచ్చుట. తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసును లోకములోనికి ఆయన ప్రాణమును, రక్తమును అర్పించుటకు గాను పంపించెను.

3. ఇచ్చుట వలన యింకను యెక్కువగ దేవునితో సన్నిహిత సంబంధమును కలిగియుండి ఆయనను యెక్కువగా ప్రేమించుటకు అవకాశము కలుగును. ప్రేమ

త్యాగమును కలిగియుండును. త్యాగము ప్రేమను బట్టి కలుగును. ఇవి రెండును విభజింపబడ నేరవు. హృదయ పూర్వకమైనటువంటి త్యాగముతో కూడిన ప్రేమగలవారై యుండవలెనని ఆయన క్రైస్తవ్యము ధనముకంటె హెచ్చుగ హృదయమును, మనస్సును, సమయమును దేవుని కిచ్చుటను గూర్చిన తెలియజేయు చున్నది. అయితే ఈ పేద విధవరాలిని గూర్చిన అంశములో ధనమును యిచ్చుటను గూర్చిన అవసరతను ప్రభువైన యేసు చెప్పుచున్నారు.

4. ప్రపంచమంతను సువార్త ప్రకటింపబడుటకు మనము ధనమును ఈయవలెను. ఆత్మల రక్షణను గూర్చిన నమ్మిక కలిగియుండిన యెడల ఇచ్చుటను గూర్చి కూడ నమ్మవలెను.

5. అవసరతలలో యున్న వారిని ఆదుకొనుటకు గాను మనము ఈయాలి. అవసరతలలో యున్నవారి యెడల నిర్లక్ష్య భావము కలిగియుండిన యెడల క్రీస్తు యేసుకు కలిగిన మనసును కలిగి యుండలేము.

3. క్రైస్తవుడు ఎంతవరకు ఈయవలెను ?

1. మోషే ధర్మశాస్త్ర ప్రకారము పదియవ భాగమును ఈయవలెను. అదియు గాక హృదయము నందు నిశ్చయించుకొనిన దానిని బట్టి కూడ ఈయవలెను. కొంతమంది భక్తులైన యూదులు వారి రాబడిలో నాల్గవవంతు చివరకు మూడవవంతు కూడ ఇచ్చే వారు. యూదులు రోమా పరిపాలనలో యుండినపుడు దేవునికి దశమభాగము నీయవలెనను పద్ధతియు గలదు. దీనిని బట్టి 1) ఇచ్చేవాడుగ మానవుడు ఉండవలెనని ఆయన కోరుచున్నారు. 2) మానవుడు పొందుచున్న దానికి తగిన రీతిగ అతడు ఈయాలి. 3) దేవుని ధ్యానించుటలో గడిపే సమయమును యెక్కువ చేయవలెనని ఆయన కోరుచున్నారు.

2) మోషే ధర్మశాస్త్రములోని అంశములన్నియు ఆయన సిలువకు వాటిని కొట్టుట ద్వారా క్రీస్తు ప్రభువు యొక్క ఆజ్ఞలు అమలులోనికి వచ్చెను (కొలస్స 2:14). సణుగుకొనకయు

బలవంతముగ కాకయు ప్రతివాడు తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను (2కొరింథీ 9:7). ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది కొంత సొమ్ము తన యొద్ద నిలువ చేయవలెను (1 కొరింథీ 16:2). దీనిని బట్టి అత్యధికమైన దీవెనలు మనము నిత్యము పొందగల్గునట్లు దేవుడు మనలను అభివృద్ధి పరచిన కొలది సంతోషముతోను, ఉత్సాహముతోను మనము దేవుని కీయవలెను.

ఇచ్చుటను గూర్చిన విషయమును కుటుంబములో తెలియ జేసి, ప్రోత్సహమును కలిగించే భారము యెక్కువగ స్త్రీలపైననే గలదు. భర్త క్రైస్తవుడైతే దేవుని కిచ్చుటను గూర్చి వారిరువురు కలసి ఆలోచన చేయవలెను. అతడు క్రైస్తవుడు కానిచో ఆ బాధ్యత అంతా పూర్తిగా స్త్రీ పైననే పడును. ప్రతిదినము భోజనములో ఏదోయొక చిన్న అంశమును తగ్గించి, దానిద్వారా కొంత సేకరించగలము. ఈ విధముగ ఏదైనా కొద్దికొద్దిగా తగ్గించు కొని దానిని కూడబెట్టి దేవుని సేవకొరకిచ్చిన స్త్రీలు అనేక రెట్లుగా ఆశీర్వదించబడుదురు.

ఇచ్చే విషయములో కొంత తప్పుగ గ్రహించిన వారు కూడ గలరు. బోధకుని యొక్క జీతము, అవసరతలు, కట్టడము కొరకైన ఖర్చు - యివి మాత్రము యిస్తే సరిపోతుంది అని చెప్పుదురు. కాని మన ఆత్మల రక్షణార్థము మనము యిచ్చుట అవసరమని వారు గ్రహించి యుండరు. కొనిసార్లు ఆ బోధకుని లేక పెద్దలను సంతోష పెట్టుట కొరకు కొంతమంది కొనిసార్లు ఇస్తూ యుంటారు. ఇది తప్పు. మరికొంత మంది ఆ ధనము ఖర్చు చేయబడు విధానము యిష్టము లేదు, గనుక ఇచ్చుట లేదు అని చెప్పుదురు. ఇది క్రీస్తు ప్రభువు యిచ్చిన ఆజ్ఞను నెరవేర్చుట లేదు. ప్రతి క్రైస్తవుడు కూడ హృదయ పూర్వకముగ అతడు వర్ధిల్లిన కొలది దేవుని కిచ్చుట నేర్చుకోవాలి. ఆ ధనమును ఖర్చు చేయువారు కూడ బహుజ్ఞానయుక్తముగ దానిని ఖర్చుచేయాలి.

- లోటీ బెత్ హాబ్స్

# సంక్షిప్త వార్తలు

2017-అక్టోబరు 11వ తేదీనాడు జెర్రీబేట్స్ దంపతులు తమిళనాడు, శ్రీలంక ప్రాంతములలో తమ సువార్తకార్యక్రమమును ముగించుకొని కాకినాడ జాషువా, రిక్కీ గూటం గార్లతో పనిచేయుటకు విశాఖపట్టణం చేరుకొనిరి. రాబిన్ గూటం గారు వారిని విశాఖ విమానాశ్రయములో కలసికొని రోడ్డు మార్గమున కాకినాడకు తీసికొనివచ్చిరి. జెర్రీ బేట్స్ దంపతులు సంవత్సరమునకు రెండు మారులు సువార్తపని విషయమై భారతదేశమునకు వత్తురనునది చదువరులకు విదితమే. వారు 'వరల్డ్ ఎవాంజిలిమ్'లో యుండి జె.సి. ఛోట్ గారి సతీమణి బెట్టీఛోట్‌తో కలసి పనిచేయుచున్నారు.

2017 అక్టోబరు 11, 12 తేదీలలో అనగా బుధ, శుక్రవార దినములలో కాకినాడ సత్యవాణి ఆవరణలో బోధకుల సదస్సు జరిగెను, ఆంధ్ర-తెలంగాణ ప్రాంతముల నుండి అనేకులు హాజరై సదస్సును విజయవంతముచేసిరి. ఆ రెండు దినములలోను సోదరులు జెర్రీబేట్స్‌గారు సువార్తికులకవుసరమైన మంచి పాఠములను బోధించిరి. మరియు రిక్కీగూటం, జాషువాగూటం గార్లు పలుమారులు మధ్యలో బోధించిరి. అనేక బైబిలు ప్రశ్నలకు బైబిలు నుండియే బేట్స్ గారు, రిక్కీ గారు జవాబులను పొందుపరచిరి. త్రిత్వమును గూర్చి యేసు యొక్క దైవత్వమును గూర్చి సోదరులు బేట్స్ గారు సవిస్తరముగా వివరించిరి. మరియు రెండవ దినమున నాయకత్వలక్షణములు గూర్చి బైబిలు నుండియే అనేక ఉదాహరణలు చూపిస్తూ ఆసక్తి జనముగా వారు బోధించిరి. 12వ తేదీ గురువారం సోదరి కవితా గూటం గారు వ్రాసిన "అక్షయ ఆహారము" అనే పుస్తకమును, వాయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్ Vol-28 అను పుస్తకమును పాలాబేట్స్ గారి ద్వారా ఆవిష్కరించబడెను. కవితాగూటం గారు వ్రాసిన 'అక్షయ ఆహారము' అను పుస్తకమును చదివినవారందరు ఆమెను అభినందించుచున్నారు.

2017 అక్టోబరు 13వ తేదీ శుక్రవారం నాడు ముమ్మిడివరం మండలం మట్టలపాలెంలో నెలవారీ జరుగు సువార్తకూటములో రిక్కీగూటం గారు, జెర్రీ బేట్స్ దంపతులు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. తూర్పుగోదావరి జిల్లాలో

అంత మారుమూల గ్రామములో కూడ క్రీస్తుసంఘముండుటను చూచి బేట్స్ దంపతులు ఆశ్చర్యచకితులయ్యిరి.

మొదట్లో రెండు దినములు జరిగిన సదస్సులోను,మట్లపాలెంలోను హాజరైన వారందరికీ స్థానిక సంఘస్థులు మంచి భోజనమును సరఫరాచేసిరి. బోధకులసదస్సు విషయంలో రిక్కీ గారు అన్ని సంగతులు చూచుకొనుచు చక్కటి ఏర్పాట్లుచేసిరి. అక్టోబరు 15వ తేదీ ఆదివారం స్థానిక సత్యవాణి క్రీస్తు సంఘరాధనలో జెర్రీబేట్స్ గారు క్రీస్తుసంఘము యొక్క విశిష్టతను పలు ఉదాహరణలతో విశదీకరించిరి. అక్టోబరు 16వ తేదీనాడు రెండు వారముల మట్టుకు విశాఖపట్టణంలో బోధించుటకు గాను బయలుదేరి వెళ్లిరి.

నవంబరు 7,8,9,10 తేదీలలో కాకినాడలో జరుగబోవు లెక్చర్‌షిప్‌కు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. గతసంవత్సరము కన్నా ఎక్కువమంది హాజరుకాగలనే ఆకాంక్ష స్థానిక సంఘస్థులు కలిగియున్నారు. అందువిషయమై ప్రార్ధన చేసిన వారందరికీ వందనములు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001.

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.